క్లుప్తంగా

వాహనాల తనిఖీ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని పిట్లం – బాన్సువాడ ప్రధాన రహదారులలో గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ సాయాగౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



నస్రుల్లాబాద్(బాన్సువాడ): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు నెమ్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ సురేందర్ తెలిపారు. గురువారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అండర్–17లో కె.దినేష్, ఎం.భవాని, అండర్–14 శరణ్య, అలేఖ్య, సమీక్ష, రష్మిత, రాజేందర్, శ్రీకాంత్ ఎంపికయ్యారన్నారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి జిల్లా తరపున పాల్గొంటారన్నారు.

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇవ్వాలి



కామారెడ్డి అర్బన్: జిల్లాలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా కావడం లేదని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్‌బాబుకు గురువారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు పైడి విఠల్‌రెడ్డి, కొమిరెడ్డి చిన్న అంజయ్య, సాయిరెడ్డి, కొప్పుల నర్సారెడ్డి, వెంకటి, బండారు రాంరెడ్డి, భైరవరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



బాన్సువాడ రూరల్: దివ్యాంగ విద్యార్థులకు ప్రతిరోజూ ఫిజియోథెరపి చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని బాన్సువాడ మండల విద్యాధికారి నాగేశ్వరరావు అన్నారు. గురువారం భవిత కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన ఫిజియోథెరపి శిబిరాన్ని సందర్శించారు. అంగవైకల్యం ఉన్న విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు చేదోడు వాదోడుగా ఉండాలన్నారు. వారి వైకల్యాన్ని అవహేళన చేయకుండా ఆదరించాలన్నారు. ప్రతి గురువారం భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు గంగాధర్, ఫిజియో ఐఈఆర్‌పీ వసంత్ కుమార్ పాల్గొన్నారు.

'ఆధారాలు చూపి బాలికను తీసుకెళ్లండి'

కామారెడ్డి అర్బన్: దోమకొండకు చెందిన శ్వేత అనే అమ్మాయి మహిళా శిశు సంక్షేమ శాఖ అధీనంలో ఉందని కుటుంబ సభ్యులు ఆధారాలు చూపి బాలికను తీసుకుపోవాలని బాలరక్ష భవన్ పీడీ బావయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 25న సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు పరిధిలోని ఇస్నాపూర్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వద్ద బాలికను గమనించి పోలీసులకు అప్పగించగా..వారు అమీన్‌పూర్ మహిమ మినిస్ట్రీలో చేర్పించారన్నారు. బాలిక తన తండ్రి పేరు ప్రభాకర్, తల్లి సంధ్య, ఊరు దోమకొండ అని చెబుతోందని, అలాగే అక్క బావలు సరిత, వెంకట్‌రెడ్డిలు కామారెడ్డిలో ఉంటారని చెబుతున్నందున కుటుంబసభ్యులు కామారెడ్డి ప్రియాడిలక్స్ రోడ్డులోని బాలరక్షభవన్‌లో సంప్రదించాలని పీడీ బావయ్య పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా నర్సింలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎల్లారెడ్డి వైస్ ఎంపీపీ నర్సింలును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి తెలిపారు. జిల్లా కార్యదర్శిగా నియామకమైన నర్సింలుకు మాజీ మంత్రి షబ్బీర్ అలీ నియామక పత్రాన్ని అందించారు. పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

బతుకమ్మ సంబురాలు ప్రారంభం



సుల్తానిపేట్‌లో..



సౌత్ క్యాంపస్‌లో..



వివేకానంద స్కూల్లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలో గురువారం బతుకమ్మ సంబురాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మతో మహిళలు, చిన్నారులు పండుగను ఘనంగా ప్రారంభించారు. తీరొక్క పూలతో బతుకమ్మ, గౌరమ్మలను అందంగా తయారు చేశారు. ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఉంచి ఆడి పాడారు. అనంతరం స్థానికంగా ఉన్న చెరువులు, నీటి కుండీలలో నిమజ్జనం చేశారు. దసరా సెలవులకు వెళ్లే ముందు పలు స్కూళ్లు, కాలేజీలలో విద్యార్థినులతో కలిసి ఉపాధ్యాయులు, అధ్యాపకులు బతుకమ్మ సంబురాలు చేసుకున్నారు.



బతుకమ్మలతో మహిళలు, చిన్నారి



తాండూర్ హైస్కూల్‌లో ..



తాడ్వాయి: బతుకమ్మను పేర్చుతూ..



తలమడ్ల పాఠశాలలో ..



సదాశివనగర్ శ్రీ వాణి విద్యాలయంలో..



ఎల్లారెడ్డిలోని బ్రిలియంట్ పాఠశాలలో..



పిట్లం: బతుకమ్మతో సెల్ఫీ



హాజీపూర్ పాఠశాలలో బతుకమ్మలతో..



భిక్కనూరులో..



గాలీపూర్ ఉన్నత పాఠశాలలో ..



కొమలంచ ఉన్నత పాఠశాలలో..



అచ్చంపేట మోడల్ పాఠశాలలో ..



పాల్వంచ ఉన్నత పాఠశాలలో..



పెద్దకొడప్‌గల్ ప్రాథమిక పాఠశాలలో..



బాన్సువాడలోని బీసీ వసతి గృహంలో..



దోమకొండ మండలం ముత్యంపేటలో..



పిట్లం బ్లూబెల్స్ పాఠశాలలో ..



దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో..

వచ్చే ఎన్నికల్లో ముదిరాజుల సత్తా చాటుదాం

భిక్కనూరు: వచ్చే ఎన్నికల్లో ముదిరాజుల సత్తా చూపి, టికెట్లు ఇవ్వని రాజకీయ పార్టీలను భూస్థాపితం చేస్తామని ముదిరాజు యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీల నాగరాజు అన్నారు. గురువారం ఆయన మల్లుపల్లిలో నిర్వహించిన ముదిరాజుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ గ్రూపులోకి మార్చేందుకు సరైన చర్యలు తీసుకోకపోవడంతో ముదిరాజు నిరుద్యోగులకు కానిస్టేబుల్ ఉద్యోగావకాశాలు రాలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముదిరాజులకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఒక్క టికెట్ కూడా కేటాయించకుండా నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు.



మాట్లాడుతున్న నీల నాగరాజు

సీఎం కేసీఆర్‌పై కామారెడ్డిలో ప్రతి గ్రామం నుంచి నలుగురు ముదిరాజులను పోటీకి నిలబెట్టి ఆయనను ఓడించడం తథ్యమన్నారు. సంఘం ప్రతినిధులు నీరడి ఆంజనేయులు, మాలే నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై ఒక రోజు శిక్షణ



నెమ్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు,



బొమ్మన్‌దేవ్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీలత

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం అసంక్రమిత వ్యాధులకు సంబంధించి ఏఎన్ఎంలకు ఒక రోజు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీష మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో ఎన్‌సీడీ వ్యాధిగ్రస్తులను గుర్తించడం, పరీక్ష చేయడం, శస్త్ర చికిత్స నమోదు అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు నరేందర్ రెడ్డి, దస్తీరాం, డివిజనల్ స్థాయి ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బొమ్మన్‌దేవ్‌పల్లిలో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బొమ్మన్‌దేవ్‌పల్లిలో గురువారం సంక్రమిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ బానువాడ ఏరియా దవాఖాన కౌన్సెలర్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ.. వ్యాధి నిర్ధారణ జరిగిన వ్యక్తులకు జీవితంపై అవగాహన కలిగించి డిప్రెషన్‌లోకి వెళ్ల కుండా ధైర్యం చెప్పారు. గ్రామంలో 78 మందికి పరీక్షలు నిర్వహించారు.

దసరా సెలవులతో విద్యార్థులు ఇళ్లకు..



మద్నూర్‌లో ఇంటికి వెళ్తున్న కేజీబీవీ విద్యార్థులు



ఇళ్లకు వెళ్తున్న గురుకుల విద్యార్థులు

పరీక్షలు ముగిసి దసరా సెలవులు ప్రారంభం కావడంతో గురువారం మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు బ్యాగు, పెట్టెలతో సొంతిళ్లకు బయలుదేరి వెళ్లారు. కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి వారిని తీసుకెళ్లడంతో బస్టాండ్‌లో విద్యార్థులతో నిండింది.

– మద్నూర్(జుక్కల్)

మరాఠా మహాసంఘ్ జిల్లా కార్యదర్శిగా వినోద్



బాన్సువాడ: మరాఠా మహాసంఘ్ యువజన విభాగం కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా వినోద్ కుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీబాజీరావు భోస్లే ప్రకటించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. మరాఠాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

బహుజన సమైక్య జిల్లా ఇన్‌చార్జిగా స్వామి



భిక్కనూరు: తెలంగాణ బహుజన సమైక్య కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా తిప్పాపూర్ గ్రామానికి చెందిన బోయిని స్వామి ముదిరాజును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు చంటి ముదిరాజు గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా బోయిన స్వామి మాట్లాడుతూ.. బహుజన రాజ్యాధికారం బహుజనుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు.

సౌత్‌క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్‌గా రాజేశ్వరి



భిక్కనూరు: తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్‌గా సోషల్ వర్క్ హెచ్‌వోడీ రాజేశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె గురువారం సౌత్ క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సౌత్ క్యాంపస్ అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డిలో ఓటు హక్కుపై ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్ రావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. ఐదేళ్లు మనకు సేవ చేసే నాయకుడిని ఎన్నుకునే ముందు ఆయన గురించి అన్ని విధాలా తెలుసుకుని ఓటు వేయాలన్నారు. ఓటు అమ్ముకోవడం నిన్ను నువ్వు అమ్ముకున్నట్లు అవుతుందన్నారు. ఏవైనా సమస్యలుంటే ఓటరు హెల్ప్‌లైన్ 1950కి విన్నవించుకోవచ్చన్నారు. గ్రామ సంఘం అధ్యక్షులు సవిత, సీసీ అబ్బ లింగం, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేయించండి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హరిజనవాడ అంగన్‌వాడి కేంద్ర భవనానికి మరమ్మతులు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. నాసిరకమైన మెటీరియల్‌తో నిర్మించడంతో ప్రారంభం కాకముందే ఆ భవనానికి పగుళ్లు ఏర్పడ్డాయన్నారు. దీంతో అధికారులు భవనాన్ని ప్రారంభించడం లేదని, ప్రస్తుతం అంగన్‌వాడి కేంద్రాన్ని అద్దె భవనంలో నడిపిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే భవనానికి మరమ్మతులు చేయించి, వాడుకలోకి తీసుకురావాలని కోరారు.

గ్యారంటీ పథకాలతో బీఆర్ఎస్, బీజేపీ గల్లంతు

- కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి

భిక్కనూరు: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో బీఆర్ఎస్, బీజేపీల అడ్రస్ గల్లంతవడం ఖాయమని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. గురువారం సిద్ధరామేశ్వరనగర్‌లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా బీఆర్ఎస్ నేతలు చేసిన అవినీతి అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలు అర్హులకు ఇవ్వకుండా కేవలం ధనవంతులైన బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండూ ఒక్కటేనని, ప్రజలను మోసం చేసేందుకు ఆ రెండు పార్టీల నేతలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాప్రతినిధులకు సమాచారమివ్వడం లేదు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆరోపణ
- సమస్యలపై వాడివేడిగా సమావేశం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండల సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా ఐదుగురు సర్పంచ్‌లు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. మైనార్టీలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తే ఎంపీటీసీలకు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని శాబ్దిపూర్ ఎంపీటీసీ నిమ్మ జలజ ప్రశ్నించారు. మైనార్టీ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారని అందుకే తమకు సమాచారం ఇవ్వలేదని ఎంపీడీవో శంకర్ నాయక్ తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకముందే జీపీ కరెంట్ బిల్లు కట్టాలని మెసేజ్‌లు పెడుతున్నారని ట్రాన్స్‌కో ఏఈని ప్రశ్నించారు. తిమ్మక్‌పల్లిలో డబుల్ బెడ్‌రూం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వలేదని, ఓ కరెంట్ స్తంభం పడిపోయిందని చెప్పగా వెంటనే వేయిస్తానని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. గూడెంలో కరెంట్ స్తంభం కావాలని నెల రోజుల క్రితం చెప్పినప్పటికీ ఇప్పటి వరకు పాతలేదని సర్పంచ్ స్వామి సభ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్తంభాన్ని వేయిస్తానని ఏఈ పేర్కొన్నారు. అలాగే పలు సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెచ్చారు. వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, ఎంపీడీవో శంకర్‌నాయక్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు

సమాచారం..

15న నవరాత్రి పూజ సంకల్పం, దీక్షలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి చండీ మంత్రాలయం ప్రియానందాశ్రమం 43వ చండీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 15న ఉదయం 8 గంటలకు నవరాత్రి పూజా సంకల్పం, దీక్ష, శ్రీ చక్రార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రియానంద పరివారం తెలిపింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 15 నుంచి 22 వరకు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 వరకు ఆధ్యాత్మిక, కుంకుమార్చనలు, భోజనాలు, భజనలుంటాయన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- రిటర్నింగ్ ఆఫీసర్ ప్రభాకర్

ఎల్లారెడ్డి: ఎన్నికల్లో విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మద్యం, డబ్బులు ఓటర్లకు పంచుతున్నట్లు సమాచారం అందితే వెంటనే ఘటనా స్థలానికి చేరుకోవాలని సూచించారు. వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ఏఆర్‌వోలు సురేష్, సుధాకర్, ఎలక్షన్ డీటీ రాజేశ్వర్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఆర్‌వో ప్రభాకర్

ముస్తాబవుతున్న దుర్గామాత మండపాలు

కామారెడ్డి రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో దుర్గామాత మండపాలను ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించే శరన్నవరాత్రులకు గ్రామాల్లో సైతం పట్టణాలతో పోటీ పడి భారీ సెట్టింగులు వేస్తున్నారు. దేవునిపల్లి, టేక్రియాల్, చిన్నమల్లారెడ్డి, గర్గుల్, నర్సన్నపల్లి, క్యాసంపల్లి తదితర గ్రామాల్లో సెట్టింగులు వేస్తున్నారు. యువకులు భారీ సంఖ్యలో మాలధారణ వేయడానికి సిద్ధమయ్యారు

బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

రాజంపేట: బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని రాజంపేట ఎస్సై సంపత్ హెచ్చరించారు. బుధవారం రాత్రి రాజంపేట మండలం షేర్ శంకర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని మూడు మామిళ్ల తండాలో ఓ బెల్ట్ షాప్‌పై దాడులు నిర్వహించి 8 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు.